ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
27-07-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 329 | పేజీలు : 8 | వెల : 4
జయభేరి



# 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు

అధికారంలోకి వచ్చి ఏడాది తిరక్కముందే దాదాపు 60 వేల ఉద్యోగాల నియామకాలు జరపడం ద్వారా యువత పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకుంటున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చెప్పారు. అధికారం చేపట్టిన 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలను అందించిన విషయాన్ని గుర్తుచేస్తూ, డీఎస్సీ, గ్రూప్ 1, 2, 3, లాంటి వివిధ శాఖల్లో ఖాళీలైన మరో 30 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేస్తూ నిరుద్యోగ యువకుల్లో విశ్వాసం కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యతగా ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణ ఫైర్ సర్వీసెస్ - సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లో ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌ను ముఖ్యమంత్రి సమీక్షించి వారి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి, గతంలో 30 వేలు మంది నియామక పత్రాలు అందుకున్న వారిలో 483 ఫైర్‌మెన్‌లు, 155 డ్రైవర్ ఆపరేటర్‌స్‌కు కూడా ఉండటం, వారిప్పుడు కఠిన శిక్షణ కూడా పూర్తి చేసుకోవడంపట్ల ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలియజేశారు. ఏ ప్రమాదాలు జరిగినా ప్రాణాలకు తెగించి సామాజిక బాధ్యతగా ఉద్యోగంలో చేరడానికి ముందు కొచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వం మిమ్మల్ని అభినందిస్తుందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి, వారిచ్చే సూచనలు అమలు చేయడానికి, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని నడిపించాలన్నదే తమ ఆలోచనగా పేర్కొన్నారు. సహేతుకమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఎవరూ నిరసనలు, ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదన్నారు.

కార్గిల్.. ప్రతి భారతీయుడి గుండెల నిండా చెరగని ముద్ర వేసిన పేరు. సరిహద్దులను దాటుకుని అక్రమంగా మనదేశంలోకి చొరబడ్డ పాకిస్తాన్ సైన్యాన్ని, మిలిటెంట్లను భారతీయ జవాన్లు తరిమి కొట్టిన ప్రాంతం అది. కార్గిల్‌ను విడిపించుకునే క్రమంలో యుద్ధం చేసింది భారత్. ఈ క్రమంలో 500 మందికి పైగా యుద్ధ వీరులను కోల్పోయిన ప్రదేశం అది.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంకేంద్ర పాలిత ప్రాంతం లడఖ్‌లోని ద్రాస్‌కు చేరుకున్నారు.

# ఉగ్రవాదాన్ని ఉపేక్షించం



జయభేరి, న్యూఢిల్లీ, జూలై 26:

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ప్రధాని మోదీ వార్ మెమోరియల్ వద్దకు చేరుకుని పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో అమరులైన జవాన్లకు ఘన నివాళులర్పించారు. కార్గిల్ నుంచి పాకిస్థాన్ దుష్ట ప్రణాళికలు ఎప్పటికీ ఫలించవని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. 1999 యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా నేడు దేశవ్యాప్తంగా కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటున్నాం.లడఖ్‌లోని షింకున్ లా టన్నెల్ ప్రాజెక్టును ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ లేహ్‌కు అన్ని ప్రాంతాలను కనెక్టివిటీని అందిస్తుంది. ఇది పూర్తయితే, ఇది ప్రపంచంలోనే ఎత్తైన సొరంగం అవుతుంది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం లడఖ్‌పై ఎక్కువ దృష్టి సారించింది. ఇక్కడ అనేక ప్రధాన రహదారులకు మరమ్మతులు చేసి కొత్త రోడ్లు, వంతెనలు నిర్మించారు.కార్గిల్‌లో అమరవీరులకు నివాళులు అర్పించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. దేశం కోసం చేసిన త్యాగాలు అజరామరమని కార్గిల్ విజయ్ దివస్ చెబుతోందన్నారు. రోజులు, నెలలు, సంవత్సరాలు, దశాబ్దాలు, శతాబ్దాలు కూడా గడిచిపోతున్నాయి. దేశాన్ని రక్షించడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టిన ప్రజలు మనం యుద్ధంలో గెలవడమే కాదు, సత్యం, సంయమనం, శక్తికి అద్భుతమైన ఉదాహరణనిచ్చామన్నారు.కార్గిల్ యుద్ధ సమయంలో ఒక సాధారణ దేశస్థుడిలా సైనికుల మధ్య

...మిగతాది 2 లో



# కేసీఆర్ ను బద్నాం చేసే పనులు ఆపండి

జయభేరి, కరీంనగర్, జూలై 26:

రాజకీయ కక్షతో కేసీఆర్ ను బద్నాం చేయాలనే పంపులను ఆన్ చేయడం లేదు. రాజకీయాలకోసం ప్రజలను, రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కన్నెపల్లి లక్ష్మీ పంప్ హౌస్ ను కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ కల్పతరువు అన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులం ప్రాజెక్టును పరిశీలించామని చెప్పారు. ఏ ప్రభుత్వం చేయనంత వేగంగా ప్రాజెక్టు పూర్తిచేశాం. తెలంగాణలో కరువు అనే మాట వినపడవద్దనే సంకల్పంతో ప్రాజెక్టు నిర్మించామని కేటీఆర్ అన్నారు.రెండు జీవనదుల నుంచి నీటిని తీసుకోవాలని బహుళార్థక ప్రాజెక్టు నిర్మించాం. రెండు రోజులు కేసీఆర్ ఆదేశం మేరకు

...మిగతాది 2 లో



# పంచాయితీ ఎన్నికల లైన్ క్లియర్

జయభేరి, హైదరాబాద్:

రాష్ట్రంలో సాధ్యమైనంత తొందరగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రిజర్వేషన్లకు సంబంధించి బీసీ కమిషన్ సైతం నిర్దిష్ట గడువు లోగా నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని చెప్పారు. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావస్తున్నందున రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుండా గత రిజర్వేషన్లలే కొనసాగించాలని, ఆగష్టు నెలలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల నిర్వహణకు ఎదురవుతున్న ఆటంకాలను ముఖ్యమంత్రి అధికారులను ఆరా తీశారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి కొత్త ఓటర్ల జాబితా రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందాల్సి ఉందని అధికారులు వివరించగా, జాబితా రాగానే వెంటనే ఎన్నికల ప్రక్రియను చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో పంచాయతీ సంస్థల ఎన్నికల నిర్వహణ, అవసరమైన కార్యాచరణపై ముఖ్యమంత్రి సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

# తెలంగాణలో మళ్లీ ఎల్ఆర్ఎస్

## కీలక ఆదేశాలు జారీ




జయభేరి, హైదరాబాద్:

తెలంగాణలో మళ్లీ లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌ను అమల్లోకి తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మీడియాకు ప్రభుత్వం కీలక ప్రకటన జారీ చేసింది. ఈ రోజు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో విధివిధానాలు ఖరారు కోసం శుక్రవారం మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇతర ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు ఇప్పటివరకు క్లియర్ అవ్వని ఎల్ ఆర్ ఎస్ సమస్యలను.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల్లో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని అధికారులకు సూచించారు. 2020లో ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.44 లక్షల మంది అప్లికేషన్లు సమర్పించారు. కార్పొరేషన్లలో 4.13 లక్షలు, మున్సిపాలిటీల్లో 10.54 లక్షలు, పంచాయతీల్లో 10.76 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రత్యేక టీముల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

...మిగతాది 2 లో

# రాష్ట్రానికి తగ్గిన రూ. 76,795 కోట్ల ఆదాయం



జయభేరి, అమరావతి, జూలై 26:


గత వైసీపీ ప్రభుత్వం అవలంభించిన ఆర్థిక దోపిడీ వల్ల రాష్ట్రానికి రూ. 76,795 కోట్ల ఆదాయం తగ్గిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయడంతో పెట్టుబడులు తగ్గిపోయాయని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశంలో శుక్రవారం గత ప్రభుత్వ ఆర్థిక అవకతవలకపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 201924 మధ్య రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతిందని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం మళ్లించారని దుయ్యబట్టారు. డ్వాక్రా మహిళల నిధులను కొట్టేశారు. పంచాయతీలకు వెళ్లాల్సిన నిధులను దారి మళ్లించారు. ప్రభుత్వ ఆస్తులను, విశాఖలో ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టారని విమర్శించారు.పోలవరం పూర్తయి ఉంటే ఏపీకి రూ. 45 వేల కోట్ల ఆదాయం వచ్చేదని వివరించారు. ఇసుక అక్రమాల ద్వారా రాష్ట్రానికి రూ. 7 వేల కోట్లు, గనుల దోపిడీ ద్వారా రాష్ట్రానికి రూ.9,750 కోట్ల మేర నష్టం జరిగిందని అన్నారు. రాజధాని అమరావతిని కొనసాగించి ఉంటే విశ్వనగరంగా అభివృద్ధి చెందేదని, రూ. 3లక్షల కోట్ల ఆస్తి, 7 లక్షల ఉద్యోగాలు వచ్చేవని బాబు పేర్కొన్నారు. ఏపీకి ఆదాయ వనరులు భారీగా తగ్గాయని, వృద్ధిరేటు 13.5 నుంచి 9. 5 శాతానికి పడిపోయిందని వెల్లడించారు. 2014 19 టీడీపీ హయాంలో రాష్ట్రాభివృద్ధి కోసం కొత్త పోర్టులు ప్రారంభించామని వివరించారు. ఏపీకి సుదీర్ఘ తీర ప్రాంతం ఉండడం కలిసి వచ్చే అంశమని అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# పొంగిపొర్లుతున్న శ్రీశైలం రిజర్వాయర్

జయభేరి, కర్నూలు, జూలై 26:

శ్రీశైలం రిజర్వాయర్‌కి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. కృష్ణానది ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. ఏపీతోపాటూ రెండు తెలుగు రాష్ట్రాల్లో వరదనీరు వచ్చి చేరుతోంది. గడిచిన వారం, 10రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే ఆల్మట్టి నారాయణపూర్ జూరాల ప్రాజెక్టులు నిండిపోయి.. శ్రీశైలానికి నీటిని విడుదల చేస్తున్నారు.

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## ఉగ్రవాదాన్ని ఉపేక్షించం

ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు ప్రధాని మోదీ. ఈరోజు మళ్లీ కార్గిల్ భూమిపైకి వచ్చినప్పుడు ఆ జ్ఞాపకాలు మదిలో మెదులడం సహజం. మన బలగాలు ఇంత కష్టతరమైన యుద్ధాన్ని ఎలా నిర్వహించాయి, మాతృభూమిని రక్షించడానికి అత్యున్నత త్యాగం చేసిన అమరవీరులకు వందనం చేస్తున్నాను అంటూ ప్రధాని భావోద్వేగానికి లోనయ్యారు. మరోవైపు పాకిస్థాన్‌పై విరుచుకు పడిన ప్రధాని మోదీ, కార్గిల్‌లో యుద్ధంలో విజయం సాధించడమే కాదు, సత్యం, సంయమనం, బలాన్ని అద్భుతంగా ప్రదర్శించామన్నారు. ఆ సమయంలో భారతదేశం శాంతి కోసం ప్రయత్నిస్తోంది. దానికి ప్రతిగా పాకిస్తాన్ తన వక్రబుద్ధి చూపించింది. కానీ నిజం ముందు అబద్ధం, భీభత్సం ఓడిపోయాయన్నారు ప్రధాని మోదీ.పాకిస్థాన్ గతంలో చేసిన అన్ని నీచ ప్రయత్నాలలో విఫలమైంది. వక్ర బుద్ధి మార్చుకోని పాకిస్తాన్ దాని చరిత్ర నుండి ఏమీ నేర్చుకోలేకపోయింది. అది ఉగ్రవాదం, ప్రాక్సీ వార్ సహాయంతో తనకు తానుగా సంబంధం కలిగి ఉండటానికి ప్రయత్నిస్తోంది. టెర్రర్ మాస్టర్లు నేరుగా వినగలిగే ప్రదేశం నుంచి మాట్లాడుతున్నా.. ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలని, వారి దుర్మార్గపు ఉద్దేశాలు ఎప్పుడూ ఫలించవని, మన సైనికులు పూర్తి శక్తితో ఉగ్రవాదాన్ని అణిచివేస్తారని.. శత్రువులకు తగిన సమాధానం ఇస్తారని ఈ ఉగ్రవాద పోషకులకు ప్రధాని మోదీ హెచ్చరించారు.ఆగస్టు 5వ తేదీకి ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తవుతుందని ప్రధాని మోదీ అన్నారు. జమ్మూ కాశ్మీర్ నేడు కొత్త భవిష్యత్తు గురించి, పెద్ద కలల గురించి ఆలోచిస్తుందన్నారు. జి20 వంటి గ్లోబల్ సమ్మిట్ ముఖ్యమైన సమావేశాలకు ఆతిథ్యం ఇవ్వడానికి జమ్మూ కాశ్మీర్ గుర్తింపు పొందింది. జమ్మూ కాశ్మీర్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు పర్యాటక రంగం కూడా పెరుగుతోంది. లడఖ్ అభివృద్ధికి సంబంధించి, ఈ రోజు లడఖ్‌లో కూడా కొత్త అభివృద్ధి ప్రవాహం సృష్టించబడిందని ప్రధాని మోదీ అన్నారు. శింకున్ లా టన్నెల్ నిర్మాణ పనులు ఈరోజు ప్రారంభమయ్యాయి. దీని ద్వారా, లడఖ్ ఏడాది పొడవునా మరియు ప్రతి సీజన్‌లో దేశంతో అనుసంధానించబడి ఉంటుంది. ఈ సొరంగం లడఖ్ అభివృద్ధి మరియు మెరుగైన భవిష్యత్తు కోసం కొత్త అవకాశాలకు కొత్త మార్గాలను తెరుస్తుంది.

## తెలంగాణలో మళ్లీ ఎల్‌ఆర్‌ఎస్

దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలని సూచనలు చేశారు. అధికారులతో సమీక్ష సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత పటిష్టంగా లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)ను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోందని చెప్పారు. ఎల్.ఆర్.ఎస్ విధి విధానాలపై పూర్తి స్థాయిలో కసరత్తు నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులు వీలైనంత వేగంగా పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచన చేశారు. ఇందు కోసం 33 జిల్లాల్లో ప్రత్యేకంగా ఒక టీములను రూపొందించాలని చెప్పారు. సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డెప్యుటేషన్ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఫైనాన్స్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రామకృష్ణా రావు, ల్యాండ్ అండ్ రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సెక్రెటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జీహెచ్ఎంసీ కమిషనర్ కాట అమ్రపాలి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు..

## పొంగిపోర్లుతున్న శ్రీశైలం రిజర్వాయర్

ఇప్పటికే శ్రీశైలం రిజర్వాయర్ 100 టిఎంసిల మైలురాయిని దాటింది. 215 టీఎంసీలకుగాను ఇప్పటికే వంద టీఎంసీలు చేరడం, వరద నీరు కారణంగా రోజుకు 20 టీఎంసీలు వరకు వరదనీరు వచ్చి చేరుతోంది. మరోవారం రోజుల్లో రిజర్వాయర్ నిండటం ఖాయంగా కనిపిస్తోంది. అటు తుంగభద్ర డ్యామ్ 28 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ దగ్గర తుంగభద్ర ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజుల్లో కర్నూలు మీదుగా శ్రీశైలం చేరనుంది. అటు కృష్ణ, ఇటు తుంగభద్ర నదుల వరద ప్రవాహం శ్రీశైలం చేరుతుండటంతో తాగు, సాగు, విద్యుత్ కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు రైతులు.

## కేసీఆర్ ను బద్నాం చేసే పనులు..

ఎగువ గోదావరి నుంచి దిగువ వరకు పర్యటించామని కేటీఆర్ తెలిపారు. లోయర్, మిడ్ మానేరులో, శ్రీ రామ్ సాగర్ ప్రాజెక్టుల్లో తక్కువ నీటినిల్వ ఉంది. బాబ్లీ ప్రాజెక్టు నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. లక్ష్మి పంప్ హౌజ్ నుండి నీళ్లు ఎత్తిపోయవచ్చు అని అధికారులను అడిగాం. నీటిని అందించడం లేదని రైతులు బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్న సంఘటనను భూతద్దంలోపెట్టి చూస్తున్నారు. రాజకీయం చేయకుండా నీళ్లు అందించాలని కోరుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ కోరారు. 10లక్షల క్యూసెక్కుల నీరు కిందకు వెళ్లడం మా కళ్లారా చూశాం. కానీ, పైనఉన్న ప్రాజెక్టులు నీళ్లులేక చూసి బాధపడుతున్నాం. ప్రభుత్వానికి వాడుకునే తెలివి లేదు. 17 పంపులు పని చేస్తున్నాయి. రాజకీయ పరమైన నిర్ణయం లేకపోవడంవల్ల అధికారులు ఏమి చేయలేకపోతున్నారు. కేసీఆర్ ను బదునాం చేయాలనే పంపులు నడపడం లేదు. ఆరు నెలలు రాజకీయం చెద్దాం. నాలుగున్నరేళ్లు అభివృద్ధికోసం పాటుపడుదామని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయక సాగర్ ప్రాజెక్టులకు వేరే మార్గం ద్వారా నీళ్లువచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. నీటిని లిఫ్ట్ చేయాలని కేటీఆర్ కోరారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు ప్రభుత్వానికి గడువు ఇస్తున్నాం. అసెంబ్లీలో నిలదీస్తాం. ఆగష్టు 2వ తేదీ తర్వాత 50వేల మంది రైతులతో కలిసి వెళ్లి మేమే పంపులు ఆన్ చేస్తామని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## షిర్డీ ట్రైన్ లో దోపిడి

✍ జయభేరి, సికింద్రాబాద్:

దొంగలు హల్ చల్ చేసిన షిరిడి సాయి నగర్ కాకినాడ పోర్ట్ ట్రైన్ శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేరుకుంది. బాధితులు దొంగతనం సుమారు అర్ధ రాత్రి 2 గంటల ప్రాంతంలో దోపిడీ జరిగినట్లు చెప్తున్నారు. 30 మంది కి పైగా బాధితుల లగేజీ బ్యాగ్ లు, మని పర్సులు... మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లినట్టు చెప్పారు. సుమారు 30 లక్షల విలువ చోరీ అయినట్టు సమాచారం.. బి3,బి4,బి5 ఏసీ కోచ్ లలో ప్రయాణిస్తున్న ప్రయాణికులను దోపిడికి గురయ్యారు. నిద్రలో ఉండగా దోపిడీ జరిగినట్లు తెలిపారు. పర్భని దగ్గర జరిగినట్లుగా అనుమానిస్తున్నారు.

## హాస్టల్ లో యువతి దారుణహత్య

✍ జయభేరి, బెంగళూరు:

బెంగళూరులోని కోరమంగళలో ఒక లేడీస్ పీజీ హాస్టల్లో ఉంటున్న 22 ఏళ్ల యువతి దారుణ హత్యకు గురైంది. ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న కృతి కుమారి అనే యువతిని బీహార్ కు చెందిన 22 ఏళ్ల యువకుడు అతి కిరాతకంగా హత్య చేశాడు.అర్ధరాత్రి సమయంలో హంతకుడు హాస్టల్ లోకి జొరబడ్డాడు. ఎవరి కంటా పడకుండా కృతి కుమారి థర్డ్ ఫ్లోర్ లో ఉన్న రూంలో ఉంటుందని తెలుసుకున్నాడు. ఆమె ఉంటున్న రూంలోకి ప్రవేశించాడు."ప్లాన్ ప్రకారం ఆమెను హత్య చేయాలని డిసైడ్ అయి వెళ్లి తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆ యువకుడు కృతి కుమారి గొంతు కోశాడు. తీవ్ర గాయాలపాలైన ఆ యువతి స్పాట్ లోనే ప్రాణాలు కోల్పోయింది. లేడీస్ హాస్టల్.. అది కూడా అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరగడంతో ఆ హాస్టల్ లో ఉంటున్న మహిళలంతా తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. కొందరు యువతులైతే రాత్రికి రాత్రే పీజీ ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఈ ఘటన బెంగళూరులో పీజీల్లో ఉంటున్న యువతులను ఉలిక్కిపడేలా చేసింది.

# స్టడీ టూర్లు.. స్టడీ ఎంతో..?

**జీహెచ్ఎంసీ ఆర్థిక సంక్షోభం కార్పొరేటర్లకు పట్టదా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే జీహెచ్ఎంసీ ఆర్థికంగా కుదేలు కావటంతో పాటు రొటీన్ మెయింటనెన్స్ గగనంగా మారిన సంగతి తెలిసిందే. పంజాగుట్ట, అమీర్‌పేట బల్దియా మార్కెట్ల ఆధునీకరణ కోసం టెండర్ల ప్రక్రియను చేపట్టి, ఏజెన్సీలు ఖరారైన తర్వాత వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా బ్రేక్ వేశారంటే జీహెచ్ఎంసీ ఆర్థిక సంక్షోభం తీవ్రతను అంచనా వేయవచ్చు.**

✍ జయభేరి, హైదరాబాద్, జూలై26:




జీహెచ్ఎంసీకి ఆదాయ వనరులను సమకూర్చటంతో పాటు ఆ ఆదాయంతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి, పౌర సేవల నిర్వహణను చేపట్టాల్సిన కార్పొరేటర్లు ఖజానాలో చిల్లి గవ్వలేనప్పుడు స్టడీ టూర్లకు వెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి ప్రయత్నాలు, గొంతెమ్మ కోర్కెలు కార్పొరేషన్ మనుగడను ప్రశ్నార్థకం చేసే ప్రయత్నాలేనన్న విమర్శలు సైతం లేకపోలేవు. పైగా పైసాపైసా కూడబెట్టి రైతులకు రుణమాఫీ చేశామని ఇటీవలే వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి సర్కారు ఇలాంటి దుబారా ఖర్చులను ప్రోత్సహిస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది.ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో అనధికారికంగా స్టడీ టూర్ల విషయంపై పలువురు కార్పొరేటర్ల మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. వచ్చే సంవత్సరం డిసెంబర్ నెలాఖరుతో తమ పదవీకాలం ముగియనుండటంతో మళ్లీ ఎన్నికలెప్పుడు జరుగుతాయో, జరిగినా గెలిచేదెవరో, అవకాశమున్నప్పుడే దేశంలోని రెండు ఇతర మహానగరాలకు స్టడీ టూర్‌కు వెళ్దామన్న విషయంపై కార్పొరేటర్లు చర్చించుకున్నట్లు సమాచారం. ఇదే విషయంపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్న కొందరు కార్పొరేటర్లయితే ఏకంగా విదేశాలకు స్టడీ టూర్‌కు వెళ్దామంటూ మేయర్‌ను కోరినట్లు సమాచారం. ఇప్పుడు జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితి బాగోలేదని మేయర్ సర్దిచెప్పినా, కొందరు కార్పొరేటర్లు స్టడీ టూర్లకు ఆదేశాలివ్వాలని మేయర్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. సకాలంలో సిబ్బందికి జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించలేని దుస్థితిలో ఉన్నప్పుడు స్టడీ టూర్లను తెరపైకి తేవడం సబబు కాదని అదే స్టాండింగ్ కమిటీకి హాజరైన మరి కొందరు కార్పొరేటర్లు వ్యాఖ్యానించినట్లు సమాచారం. మొత్తానికి స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా కొనసాగుతున్న కొందరు కార్పొరేటర్లు స్టడీ టూర్లకు వెళ్లాల్సిందే, ఎంజాయ్ చేయాల్సిందేనని భీష్మించుకోవటంతో ఈ విషయంపై తర్వాత చర్చించుకుందామంటూ మేయర్ దాటవేసినట్లు సమాచారం.మొత్తం 150 మంది కార్పొరేటర్లున్న జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తుతం బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలకు చెందిన మొత్తం 146 మంది కార్పొరేటర్లున్నారు. మిగిలిన నాలుగు డివిజన్లలో ఎర్రగడ్డ, గుడిమల్కాపూర్ కార్పొరేటర్లు మృతిచెందగా, మెహిదీపట్నం, బహదూర్‌పురా డివిజన్ల నుంచి కార్పొరేటర్లుగా వ్యవహరిస్తున్న మాజీద్ హుస్సేన్ నాంపల్లి నియోజకవర్గం నుంచి మహ్మద్ మొబిన్ బహదూర్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్‌ను ఎమ్మెల్యేలుగా గెలవటంతో ఆ రెండు డివిజన్లకు కార్పొరేటర్లు లేక ఖాళీగానే ఉన్నాయి. మొత్తం 146 మంది కార్పొరేటర్లు దేశంలోని రెండు మహానగరాలకు వారం రోజుల పాటు స్టడీ టూర్‌కు వెళితే ఖర్చు కోట్లలోనే అవుతుందంటూ అధికారులు అంచనాలేస్తున్నారు.ఫ్లైటు ప్రయాణం, స్టార్ హోటళ్లలో విడిది, ట్రాన్స్ పోర్టు, రీక్రియేషన్‌తో పాటు ఇతరాత్ర ఖర్చులు కలిపి మొత్తం ఒక్కో కార్పొరేటర్‌కు కనిష్టంగా రూ.5 లక్షల వరకు ఖర్చు కానున్నట్లు అంచనా వేస్తున్నట్లు సమాచారం. టూర్‌కు మొత్తం రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు ఖర్చుకానున్నట్లు సమాచారం. కనీసం ఉద్యోగులకు సకాలంలో జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు బెనిఫిట్లు, పెన్షన్లు కూడా చెల్లించలేని దుస్థితిలో రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల నిధులు జీహెచ్ఎంసీకి ఒక రకంగా పెద్ద ఖర్చే. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు తీవ్రస్థాయిలో నిరసనలు చేపడుతున్న సమయంలో స్టడీ టూర్లకు వెళ్తే, అందుకు నిరసనగా కాంట్రాక్టర్లు వర్షాకాలం సహాయక చర్యలను నిలిపేస్తే ఇబ్బందుల పాలయ్యే ప్రజలకు కార్పొరేటర్లు ఏం సమాధానం చెబుతారన్న విషయంపై కూడా చర్చ జరుగుతుందిహైదరాబాద్ నగర పాలక సంస్థ గ్రేటర్‌గా రూపాంతరం చెందక ముందు నుంచే కార్పొరేటర్ల స్టడీ టూర్ల పరంపర ఉన్నా, వీటి వల్ల కార్పొరేషన్‌కు ఒరిగేదేమిటీ అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 2002 నుంచి 2007 వరకున్న పాలక మండలి అప్పట్‌లో వంద సంఖ్యకే పరిమితమైన కార్పొరేటర్లు సింగపూర్, మలేషియా వంటి దేశాలకు స్టడీ టూర్లంటూ వెళ్లి, పక్షం రోజుల పాటు అక్కడ ఎంజాయ్ చేసి వచ్చారు. ఆ తర్వాత వచ్చిన పాలక మండలి కూడా నాగ్‌పూర్, ముంబై, అహ్మదాబాద్ వంటి ఇతర మహానగరాలకు స్టడీ టూర్లకు వెళ్లి వచ్చారు.కానీ వారు అక్కడ ఏఅంశంపై స్టడీ చేశారు, ఎంత సబ్జెక్టు సమకూర్చుకున్నారు అన్న విషయాన్ని కార్పొరేటర్లు గానీ, వారితో వెళ్లివచ్చిన ఆఫీసర్లు గానీ బయటకు చెప్పలేదు. పైగా ఆ వివరాలన్నింటినీ గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నాలు చేసేవారు. అహ్మదాబాద్ నగరానికి వెళ్లిన అప్పటి పాలకమండలి సభ్యులు ఓ ప్రైవేటు సంస్థ శానిటేషన్ పనుల నిర్వహణపై అధ్యయనం నిమిత్తం వెళ్లారు. దేశంలోనే పలు నగరాలు శానిటేషన్ పనులు, ఘన వ్యర్థాల నియంత్రణ(సాలిడ్ వేస్ట్) మేనేజ్‌మెంట్‌లో ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు గుర్తించి, సిటీకి వచ్చారు. అయినా ఆ తర్వాత జీహెచ్ఎంసీ సిటీలోని పలు పనులను అదే సంస్థకు అప్పగించటం విశేషం.

# కొరకురాని కొయ్యగా ఏలేటీ

- బీజేఎల్పీ లీడర్‌గా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలపై పార్టీకి
- సమాచారం ఉండకపోవడంతో కమలనాథులు గందరగోళం
- ఎదుర్కొంటున్నారట. పార్టీ పరంగా మహేశ్వర్‌రెడ్డిని సమర్థించాలా?
- తమకు సమాచారం ఇవ్వకపోవడాన్ని సీరియస్‌గా తీసుకోవాలో
- తేల్చుకోలేకపోతున్నారట బీజేపీ పెద్దలు. ముఖ్యంగా ప్రభుత్వంలో
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,
- పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుంటున్న మహేశ్వర్‌రెడ్డి
- దూకుడు చూపుతున్నారు. అయితే పార్టీకి సమాచారమివ్వకుండా...
- తను సేకరిస్తున్న సమాచారాన్ని అత్యంత రహస్యంగా
- ఉంచుతుండటం వల్ల మహేశ్వర్‌రెడ్డి తన సొంత అజెండా అమలు
- చేస్తున్నారా? అనే అనుమానాలను రేకెత్తిస్తున్నారు. కాంగ్రెస్
- ప్రభుత్వంపై ఒంటరి పోరాటం చేస్తున్న మహేశ్వర్‌రెడ్డికి ఏమైనా
- రహస్య అజెండా ఉందా? అని బీజేపీ నేతలే ఆరా తీస్తుండటం
- చర్చనీయాంశంగా మారింది.



✍ జయభేరి, హైదరాబాద్, జూలై 26 :

బీజేపీ అంటే క్రమశిక్షణకు మారు పేరు. పార్టీ పరంగా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా.. ముందుగా వివిధ స్థాయిల్లో చర్చించాలి. ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలి. అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తేనే ముందుకువెళ్లాలి. రాష్ట్ర స్థాయి అంశాలైతే రాష్ట్ర పార్టీ చీఫ్ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. పార్టీలో ఏ స్థాయి లీడర్ అయినా ఈ పద్ధతి పాటించాల్సింది. ఐతే బీజేఎల్పీ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాత్రం ఈ పద్ధతిని పాటించడం లేదట... తనకు తోచినది... తెలిసినది పార్టీ వేదికలపై బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారట. బీజేఎల్పీ లీడర్‌గా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలపై పార్టీకి సమాచారం ఉండకపోవడంతో కమలనాథులు గందరగోళం ఎదుర్కొంటున్నారట. పార్టీ పరంగా మహేశ్వర్‌రెడ్డిని సమర్థించాలా? తమకు సమాచారం ఇవ్వకపోవడాన్ని సీరియస్‌గా తీసుకోవాలో తేల్చుకోలేకపోతున్నారట బీజేపీ పెద్దలు. ముఖ్యంగా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుంటున్న మహేశ్వర్‌రరెడ్డి దూకుడు చూపుతున్నారు. అయితే పార్టీకి సమాచారమివ్వకుండా... తను సేకరిస్తున్న సమాచారాన్ని అత్యంత రహస్యంగా ఉంచుతుండటం వల్ల మహేశ్వర్‌రెడ్డి తన సొంత అజెండా అమలు చేస్తున్నారా? అనే అనుమానాలను రేకెత్తిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒంటరి పోరాటం చేస్తున్న మహేశ్వర్‌రెడ్డికి ఏమైనా రహస్య అజెండా ఉందా? అని బీజేపీ నేతలే ఆరా తీస్తుండటం చర్చనీయాంశంగా మారింది.2023 అసెంబ్లీ ఎన్నికల ముందే బీజేపీలోకి వచ్చిన మహేశ్వర్‌రెడ్డి... నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిచారు. బీజేపీలోకి కొత్తగా వచ్చినా.. ఆయన సీనియారిటీ, వాగ్దాటి, సామాజిక నేపథ్యం వంటివి పరిగణలోకి తీసుకుని బీజేఎల్పీ లీడర్‌గా అవకాశమిచ్చింది పార్టీ. అయితే పార్టీ శాసనసభాపక్ష నేతగా ఆయన పలు సంచలన ఆరోపణలు చేస్తూ... ఎప్పటికప్పుడు వార్తల్లో వ్యక్తిగా మారిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని టార్గెట్ చేస్తూ ఆర్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు మహేశ్వర్‌రెడ్డి. ఈ విమర్శలు బాగా వైరల్ అవడంతో పార్టీలో ఆయనకు మంచి గుర్తింపే లభించింది. ఐతే, అప్పట్లో పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో పార్టీ కూడా ఈ విమర్శలను బాగా వాడుకుంది. సాక్ష్యాత్తూ ప్రధాని సైతం ఆర్ ట్యాక్స్ అంటూ విమర్శలకు దిగేలా చేసింది. ఐతే ఆ తర్వాత నుంచి మహేశ్వర్‌రెడ్డి విమర్శల దాడి సొంత పార్టీకి కూడా అర్థం కావడం లేదంటున్నారు. విపక్షంలో ఉన్నారు కదా అని మహేశ్వరరెడ్డి విమర్శలను కాంగ్రెస్ లైట్‌గా తీసుకుంటేే... ప్రధాన ప్రతిపక్ష పాత్రను తమ స్థానంలో బీజేపీఎల్పీ నేత కనిపిస్తుండటంతో బీఆర్ఎస్ కూడా షాక్‌కు గురవుతోందట. ఇదే సమయంలో పార్టీలో కనీస సమాచారం లేకుండా... తన రహస్య అజెండాను అమలు చేస్తున్నారని బీజేపీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయిప్రధానంగా ఫ్లోర్‌లీడర్‌గా ఎమ్మెల్యేలను సమన్వయం చేసే బాధ్యత మహేశ్వర్ రెడ్డిపైనే ఉంటుంది. దీనికి రాష్ట్ర అధ్యక్షుడి సాయం కుడా తీసుకోవాల్సి ఉంటుంది. ఐతే ఈ పనిని పెద్దగా పట్టించుకోని మహేశ్వర్‌రెడ్డి... తాను టార్గెట్ చేసిన నేతలు, వారి కంపెనీలపై విమర్శలకు దిగుతుండటమే చర్చనీయాంశంగా మారింది. ఇలా ఆయన చేస్తున్న విమర్శలు పార్టీని సైతం ఇరకాటంలో పెడుతున్నట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యేలతోపాటు.. పార్టీకి కూడా సమాచారం ఇవ్వకుండా స్వయంగా నిర్ణయాలు తీసుకోవడంపై విమర్శలు ఎదుర్కొంటున్నారు మహేశ్వర్‌రెడ్డి. దీంతో ఎమ్మెల్యేలు, పార్టీ, మహేశ్వర్‌రెడ్డికి మధ్య సఖ్యత లేదన్న ప్రచారం మొదలైంది. బీజేపీలోకి కొత్తగా రావడంతో మహేశ్వరరెడ్డి స్టైల్ ఎవరికీ అర్థం కావడం లేదని... వాస్తవానికి ఆయన ఎప్పుడూ డిఫరెంట్‌గా నడుస్తుంటారనే చెబుతున్నారు పరిశీలకులు. బీజేపీకన్నా ముందు కాంగ్రెస్‌లో పని చేసిన మహేశ్వరరెడ్డి... అప్పట్లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డితో తీవ్రంగా విభేదించేవారు. రేవంత్‌కు వ్యతిరేకంగా గ్రూపు రాజకీయాలు నడిపి హీట్ పుట్టించే వారు. అప్పట్లో మహేశ్వర్‌రెడ్డితో ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సన్నిహితంగా మెలిగేవారు. వీరి గ్రూపులో మొత్తం 9 మంది ఉండగా, అందులో మహేశ్వర్‌రెడ్డి తప్ప మిగిలిన వారంతా కాంగ్రెస్‌లో ఉండిపోయారు. దీంతో తన చిరకాల ప్రత్యర్థిగా సీఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకున్నారని భావించినా... ఇప్పుడు తనకు ఒకప్పటి సహచరులైన భట్టి, ఉత్తమ్‌లను టార్గెట్ చేస్తూ బీ టాక్స్, యూ టాక్స్ అంటూ విమర్శలు చేయడం ఆసక్తికరంగా మారింది. ఇలా వరుసగా మంత్రులపై ఆరోపణలు గుప్పిస్తున్న మహేశ్వర్‌రెడ్డి తాజాగా మరో మంత్రి పొంగులేటిని టార్గెట్ చేయడం చర్చకు దారితీసింది.ఐతే మహేశ్వర్‌రెడ్డి తీసుకునే నిర్ణయాలు ఏవీ పార్టీ దృష్టికి వెళ్లడం లేదని చెబుతున్నారు. ఆయన రహస్య అజెండాతోనే కాంగ్రెస్‌పై ఆరోపణలు సంధిస్తున్నారని కమలనాథులు అనుమానిస్తున్నారు. ఆ రహస్య అజెండా ఏంటా? అని ఆరా తీస్తున్నారు. తన నియోజకవర్గానికి నిధులు సాధించుకోడానికే వరుసగా మంత్రులను టార్గెట్ చేస్తున్నారా? లేక బీజేఎల్పీ నేతగా పార్టీలో పట్టు పెంచుకోడానికి.. ప్రజలను ఆకట్టుకోడానికి... వన్ అండ్ ఓన్లీ... అనే సంకేతాలు పంపుతున్నారా? అన్న చర్చ జరుగుతోంది.

# నీళ్లు వృథా పోతుంటే ఎత్తిపోయకుండా రైతుల నోట్లో మట్టి కొడుతారా?

- ఆగస్ట్ 2 లోపు కాళేశ్వరం పంప్ లు ఆన్ చేయకపోతే 50 వేల మంది రైతులతో కలిసి మేమే ఆన్ చేస్తాం
- ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక చేసిన కేటీఆర్
- ఎల్ఎండీ, కన్నెపల్లి పంప్ హౌస్, మేడిగడ్డ సందర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం



**జయభేరి, కరీంనగర్ :**

ఆగస్ట్ 2 లోపు కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మోటార్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోయకుంటే 50 వేల మంది రైతులతో కలిసి మోటార్లను మేమే ఆన్ చేస్తామని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేసీఆర్ మీద కక్షతో రైతుల నోట్లో మట్టికొట్టే దుర్మార్గపు ఆలోచన చేయవద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకుల బృందం రెండు రోజుల పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. గురువారం సాయంత్రం కరీంనగర్ లోని ఎల్ఎండీ ప్రాజెక్ట్ ను బీఆర్ఎస్ బృందం పరిశీలించింది. శుక్రవారం ఉదయం కన్నెపల్లి పంప్ హౌస్ తో పాటు మేడిగడ్డ బ్యారేజ్ ను బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. మార్గ మధ్యలో కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామి దర్శించుకున్నారు. అక్కడే గోదావరి నదికి ప్రత్యేక పూజాలు చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ పరిశీలించిన తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాజకీయాల కోసం రైతులను బలి పెట్టవద్దని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. శ్రీరాం సాగర్, ఎల్ఎండీ, మిడ్ మానేరు, ఎల్లంపల్లి లో నీరు లేని కారణంగా రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు గోదావరి ఎగువన నీటి కరువు ఉంటే... మేడిగడ్డ వద్ద మాత్రం పదిలక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయన్నారు. ఈ నీటిని సకాలంలో ఎత్తిపోసుకుంటే శ్రీరాంసాగర్, ఎల్ఎండీ, మిడ్ మానేర్, రంగనాయకమ్మ సాగర్, కొండ పోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ జలాశయాలను నింపుకొని నీటి కొరత లేకుండా చేసుకోవచ్చన్నారు. కానీ కేసీఆర్ పై కోపం, రాజకీయ కక్ష ల కారణంగానే నీటిని ఈ ప్రభుత్వం ఎత్తిపోయటం లేదని కేటీఆర్ విమర్శించారు. పైన నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి లేదని ఇప్పుడు నీటిని ఎత్తిపోయకుంటే వానాకాలం పంట కూడా ఎండిపోయే పరిస్థితి ఉంటుందన్నారు. గతేడాది తమ ప్రభుత్వం సకాలంలో నీటి ఎత్తిపోసి ఎల్ఎండీ, మిడ్ మానేర్ సహా రంగనాయకమ్మ, మల్లన్న సాగర్ వరకు నీటిని తరలించిందని గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వం రైతుల పంటలు ఎండిపోయిన సరే కేసీఆర్ కు పేరు రావద్దన్న దురుద్దేశంతో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత డిసెంబర్ జనవరిలో కూడా రైతులకు నీళ్లు ఇవ్వాలని కోరితే రాజకీయ ప్రయోజనం కోసం రైతుల పంటలను ఎండబెట్టారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకే రాజకీయాలు చేద్దామని... ఆ తర్వాత నాలుగున్నరేళ్లు ప్రజల కోసం పనిచేద్దామన్నారు. ఈ అంశాన్ని తాము రాజకీయం చేయాలనుకోవటం లేదని... రైతులకు మేలు చేయాలని మాత్రమే ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. బేషజాలకు పోయి, రైతులకు అన్యాయం చేయవద్దని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి కేసీఆర్ ను గద్దె దింపేందుకు అన్ని కుట్రలు చేశాయన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) పేరుతో ఒక్కరోజులోనే నివేదిక ఇచ్చి మేడిగడ్డకు ఏదో జరిగిపోయినట్లు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అటు కాంగ్రెస్ కూడా కాళేశ్వరంలో లక్ష కోట్లు గంగపాలు అంటూ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. మొత్తానికి మీరు చేసిన కుట్రలతో కేసీఆర్ ను గద్దె దించారని ఇంకా రాజకీయాలెందుకని కేటీఆర్ ప్రశ్నించారు. ఇప్పుడు కూడా సుందిళ్ల, అన్నారం లో ఏదో ప్రమాదం అంటూ ఎన్డీఎస్ఏ పేరుతో సాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుందిళ్ల, అన్నారంలో గ్రౌటింగ్ పనులు ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ లో భాగమేనని అధికారులు చెప్పారన్నారు. బ్రహ్మాండంగా నీటి ఎత్తిపోసుకునేందుకు అవకాశం ఉందని ఒక్క ప్రభుత్వం నిర్ణయం కోసమే ఎదురుచూస్తున్నామని అధికారులు చెబుతున్నారని కేటీఆర్ అన్నారు.

కాళేశ్వరంపై కేసీఆర్ మీద చేసిన తప్పుడు ప్రచారాలు గోదావరి ప్రవాహంలో కొట్టుకుపోయాయని కేటీఆర్ అన్నారు. బంగారు పల్లెంలో పంచభక్ష పరమాన్నాలు వడ్డించి పెట్టినట్లు కేసీఆర్ గారు కాళేశ్వరం ప్రాజెక్ట్ ను మీకు సిద్ధం చేసి ఇచ్చారన్నారు. దాన్ని కూడా వాడుకోలేని దౌర్భగ్యపు పరిస్థితి లో ఈ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. తెలంగాణలో కరువు అనే పదమే ఉండకుండా చేసేందుకే కాళేశ్వరం లాంటి ప్రతిష్టాత్మకమైన బహుళార్థక ప్రాజెక్ట్ ను కేసీఆర్ తన సంకల్ప బలంతో పూర్తి చేశారని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు కామధేనువు, కల్పతరువని చెప్పారు.

గతంలో కాళేశ్వరం విషయంలో కేసీఆర్ ను బద్నాం చేశాం. ఇప్పుడు పంప్ లు ఆన్ చేస్తే కేసీఆర్ పై మనం చేసిన ప్రచారం తప్పని తేలుతుందని కాంగ్రెస్ నేతలు తేలు కుట్టిన దొంగల్లా సైలెంట్ అయిపోయారన్నారు. ఐతే మాపై దుష్ప్రచారం చేసిన సరే ఇప్పుడు రైతులకు మేలు చేయండని మాత్రమే మేము కోరుతున్నామన్నారు. ప్రజలు ఇచ్చిన మంచి అవకాశాన్ని వారికి మంచి చేసేందుకు ఉపయోగించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చ పెట్టాలని ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అదే విధంగా ఆగస్ట్ 2 తర్వాత కూడా పంప్ లు ఆన్ చేయకపోతే...కాళేశ్వరం ద్వారా ప్రయోజనం పొందుతున్న రైతులందరితో కలిసి వచ్చి మోటార్లను ఆన్ చేస్తామని హెచ్చరించారు.



## లాల్ గడి మలక్ పేట్ లో పర్యటించిన ప్రత్యేకాధికారి సైదులు

- అంగన్ వాడి, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ప్రత్యేకాధికారి
- ప్రతి విద్యార్థికి మెదడు వాపు టీకాలు అందించాలని ఆదేశం

**జయభేరి, జులై 26:**

మేడ్చల్ జిల్లా లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో ప్రత్యేకాధికారి సైదులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హరిజనవాడలో గల ప్రాథమిక పాఠశాలను సందర్శించి బియ్యం స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అంగన్ వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు మరియు గర్భిణీ స్త్రీలకు సక్రమంగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇక ఉన్నత పాఠశాలలో మెదడు వాపు టీకాల కార్యక్రమం నిర్వహించగా పాల్గొన్న ప్రత్యేకాధికారి ప్రతి ఒక్క విద్యార్థికి టీక అందేలా చూడాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మమతాబాయి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, బిల్ కలెక్టర్ అభిలాష్ రెడ్డి, పాల్గొన్నారు.

## చర్లపల్లి లో క్షయ వ్యాధి నివారణపై శిక్షణ

- కమ్యూనిటీ భాగస్వామ్యంతోనే క్షయ వ్యాధినీ అరికట్టవచ్చు - డాక్టర్ శ్రీదేవి



**జయభేరి, జులై 26:**

క్షయ వ్యాధి నిర్మూలనకు కమ్యూనిటీల భాగస్వామ్యం అవసరం అని మేడ్చల్ జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ . శ్రీదేవి అన్నారు. చర్లపల్లి లోని ఇంద్రస్ట్రీస్ అసోసియేషన్ కార్యాలయంలో చర్లపల్లి లోని ఆయా పరిశ్రమల్లో పని చేస్తున్న ఉద్యోగులు మరియు కాప్రా సర్కిల్ లో ఉన్న పలు మహిళా సంఘాల సభ్యులకు ఎన్ టి ఈ పి మరియు టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీదేవి మాట్లడుతూ కమ్యూనిటీ భాగస్వామ్యంతోనే టీబీ వ్యాధి నివారణ సాధ్యమవుతుందన్నారు. కాగా ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన వారంతా తమ తమ ప్రదేశాల్లో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి పలు సలహాలు సూచనలు అందజేయాలన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకునేలా వారిని ప్రోత్సహించాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ టి ఈ పి, టీబీ అలెర్ట్ ఇండియా ప్రతినిధులు పురుషోత్తం, రాజు పటేల్, కిషోర్, జ్యోతి, క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్త మోడిన రాజీవ్ రహదారి

- తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పరిధిలో కారు భీభత్సం
- అతి వేగంతో అదుపు తప్పి పల్టీలు కొట్టిన కారు
- యువతి, యువకుడు దుర్మరణం
- ఘటనలో మరి కొంత మందికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు




**జయభేరి, జులై 26:**

రాజీవ్ రహదారి మరోసారి రక్త మోడింది. ఓ కారు సృష్టించిన బీభత్సంతో ఇద్దరు దుర్మరణం చెందగా మరో 10 మంది గాయాల పాలయ్యారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా తుర్కపల్లి లోని జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హకీంపేటకు చెందిన మోహన్ ఓ ప్రైవేట్ కంపెనీలో వర్క్ ఫ్రం హోం ఉద్యోగం చేస్తున్నాడు. కాగా మౌలాలికి చెందిన దీపిక గచ్చిబౌలి లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తుంది. అయితే శుక్రవారం



ఉదయం మోహన్, దీపిక లు తమ తమ ఇళ్ళలో బయటకు వెళ్లొస్తామని చెప్పి ఇద్దరు కలిసి AP 02 Q 2268 నంబరు గల కారులో గజ్వేల్ నుంచి శామీర్ పేట వైపు వస్తుండగా లాల్ గడి మలక్ పేట్ ఫారెస్ట్ పరిధిలోకి రాగానే అదుపు తప్పి డివైడర్ ను ఢీకొట్టి పక్క నుండి వెళ్తున్న బైక్ కు డాచ్ ఇచ్చి ఆ పక్క నుండి వెళ్తున్న బయోలాజికల్ ఈ కంపెనీ బస్సును (TS08UD7699)ఢీకొని కారు పల్టీలు కొట్టింది. అయితే ఈ ఘటనలో కారులో ఉన్న మోహన్, దీపీకలు అక్కడికక్కడే మృతి చెందగా బైక్ పై ఉన్న శుభన్ సేన్ అనే వ్యక్తిని కారు ఈడ్చుకెళ్లగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఈ ప్రమాదంలో బైక్ ఉన్న మరో వ్యక్తీ శశిధర్ తో పాటు బస్సులో 44 మంది ఉండగా అందులో డ్రైవర్ తో పాటు మరో 8 మందికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆర్ విమ్ ఆస్పత్రికి తరలించి పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ప్రమాదంతో రాజీవ్ రహదారి పై ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోవడంతో డీసీపీ కోటిరెడ్డి, ఏసిపిలు రాములు, వెంకట్ రెడ్డి, సీఐ లు యాదయ్య, హన్మంత్ తో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.



## అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం

- ప్రభుత్వ హామీలు అమలు చేయాలని కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి డిమాండ్

**జయభేరి, మేడ్చల్ :**

ఊరి కొక కోడి ఇంటికొక ఈక అన్న చందంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉన్నదని, ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని గుండ్లపోచంపల్లి 14వ వార్డు కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో మోస పూరిత హామీలు గుప్పించిందని, ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ముఖం చాటేస్తున్నదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని హేమంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారింటిల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్ తప్ప మిగతా పథకాలను విస్మరించారని ఎద్దేవా చేశారు. జూలై నెలలో రైతుబంధు ఇవ్వాల్సి ఉండగా, ఇవ్వకుండా రుణమాఫీ పేరుతో అనేక నిబంధనలు పెట్టి కొంత సొమ్మును రైతుల ఖాతాల్లో వేసి, అరచేతిలో వైకుంఠం చూపించారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీ పథకాలైన గ్యాస్ సబ్సిడీ, మహాలక్ష్మి, తులం బంగారంతో కల్యాణలక్ష్మి, పథకాలను అమలు చేయలేదని విమర్శించారు. అమలు చేయలేని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కారణాలను వెతుకుతూ, ప్రజలతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. రైతులకు రైతుభరోసా పెట్టుబడి సాయం రూ.15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకూ అందిస్తామని చెప్పారని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పడ్డట్టే మహిళలకు ప్రతి నెల ఒకటో తేదీన రూ.2500 ఖాతాలో వేస్తామన్నారని, పెన్షన్ రూ.4వేలకు, వికలాంగులకు రూ.6 వేలు పెంచుతామన్నరని ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు.

## రైతులకు అండగా ఉంటాం

- నేరుగా మల్కాపూర్ ఇండియన్ బ్యాంక్ వద్దకు చేరుకున్నారు
- స్వయంగా బ్యాంక్ అధికారులు, అగ్రికల్చర్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృతజ్ఞతలు తెలిపిన 8 గ్రామాల రైతులు



**జయభేరి, మల్కాపూర్ :**

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన రైతు రుణమాఫీ నిధులు మల్కాపూర్ ఇండియన్ బ్యాంక్ ఖాతాదారులైన రైతులకు అంధకంపోవడంతో బ్యాంక్ వద్ద నిరీక్షిస్తున్న రైతులకు మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి అండగా నిలిచారు. విషయం తెలిసిన వెంటనే బ్యాంక్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే ఖాతాదారుల లిస్టును పరిశీలించారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే నగదు రైతుల ఖాతాల్లో జమ కాలేదని గుర్తించారు. వెంటనే వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు తో స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడి వెంటనే సరిదిద్దిన రైతుల ఖాతాల లిస్టును రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ అధికారులకు పంపించామని పేర్కొన్నారు. బ్యాంకు పొరపాటు వల్లే రైతులకు నష్టం జరిగిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎనిమిది గ్రామాలకు సంబంధించిన 3,625 మంది రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ వర్తించబోతుందని స్పష్టం చేశారు. ఇందులో లక్షలు లోపు పంట రుణాలు తీసుకున్న వారు, లక్ష 50వేల లోపు పంట రుణాలు తీసుకున్న వారు ఉన్నారని, అదేవిధంగా రెండు లక్షల లోపు, ఆ పైన కూడా పంట రుణాలు తీసుకున్న వారు కూడా ఉన్నారని ఈ మూడు రకాల రైతులకు సంబంధించిన లిస్టులను పరిశీలించి, ఆధార్ నెంబర్ సరిచేసి మళ్లీ రాష్ట్ర ప్రభుత్వానికి రుణమాఫీ కొరకు పంపించడం జరిగిందన్నారు.

అర్హులైన రైతుల పేర్లు లిస్టులో లేకపోతే వెంటనే అగ్రికల్చర్ ఆఫీసర్ కు దరఖాస్తు ఇవ్వాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతులకు సూచించారు. డిసెంబర్ 9 2023 ఇండియన్ బ్యాంకులో లోను అకౌంటు కలిగి ఉన్నవారికి మాత్రమే రైతు రుణమాఫీ వర్తిస్తుందని పేర్కొన్నారు. అర్హులందరికీ రైతు రుణమాఫీ నిధులు అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతులకు హామీ ఇచ్చారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ చేయబోతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందే బాధ్యత నేను తీసుకుంటునని భరోసా ఇచ్చారు. ఇక తమ సమస్య తెలిసిన వెంటనే స్వయంగా ఎమ్మెల్యే వచ్చే సమస్య పరిష్కరించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర ఎస్సి మోర్చ అధికార ప్రతినిధి గా వంగూరి రమేష్

**జయభేరి, జనగామ, జులై 26 :**

వంగూరి రమేష్ విలేకరులతో మాట్లాడుతూ నాపై నమ్మకం తో బీజేపీ ఎస్సి మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి గా నియమించినందుకు మోర్చా రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్ ఎల్ ఏ కొండేటి శ్రీధర్ నా నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి. బీజేపీ రాష్ట్ర వైస్ ప్రసిడెంట్ మాజీ ఎమ్ ఎల్ ఏ సంకినేని వెంకటేశ్వరావు. ఎస్సి మోర్చా రాష్ట్ర ప్రబారి మనోహర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రాంచంద్రయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొబ్బా భాగ్యరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట ప్రధాన కార్యదర్శి లు కుమ్మరి శంకర్, క్రాంతి కిరణ్, నకిరేకంటి మొగిలయ్య, అభిమానులకు, రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు,



మండల నాయకులకి అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి మొండి చేయి

- రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం. గత ప్రభుత్వ అనవాతీనే కోనసాగింపు.
- ఫీజు రీయంబర్స్ మెంట్స్, మెస్ ఛార్జీలు పై స్పష్టత కరువు.
- యూనివర్శిటీలు అభివృద్ధికి నిధులు శూన్యం -ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ భిక్షం
- స్కిల్ యూనివర్సిటీ, ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ పాఠశాలలు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ గురుకులాలు ఊసే లేదు.




**జయభేరి, జనగామ, జులై 26:**

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు.... ఈ కార్యక్రమంలో SFI జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం పాల్గొని మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3% ఇది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువ.గత బడ్జెట్లో విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించింది. అది ప్రస్తుతం 21,292కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య యే మాత్రం అభివృద్ధి కాదని ఎస్ఎఫ్ జిల్లా కమిటీ భావిస్తోంది.

కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పినది.కానీ దాని ఊసు ఈ బడ్జెట్లో లేదు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని అన్నారు.దాని గురించి చర్చే లేదు. యూనివర్శిటీల అభివృద్ధి రాష్ట్రంలో 500 కోట్లతో ఎలా సాధ్యం అవుతుంది. వీటిలో ఉస్మానియా, మహిళా యూనివర్సిటీ 200 కోట్లు పోనూ 300 కోట్లు పలహారం పంచినట్లు పంచారు. యూనివర్శిటీల నిర్వహణ మినహా అభివృద్ధికి యూనివర్శిటీలు నోచుకోవు. ప్రజా ప్రభుత్వం ఎలా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తుందో తెలపాలని ఎస్ఎఫ్ఐ ప్రశ్నిస్తుంది. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పాలనలో యూనివర్శిటీలు దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్,భవనాలు, ఖాళీల భర్తీ, మౌళిక సదుపాయాలు కల్పిస్తామని ప్రతి యూనివర్శిటీకి అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పారు. ఉస్మానియా కు 1000 కోట్లు,మహిళ యూనివర్శిటీఅభివృద్ధి కోసం. 500 కోట్లు నిధులు నిర్వహణ, బాసర ఐఐఐటి అభివృద్ధి, అలాగే ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో నూతన యూనివర్శిటీలు కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ యూనివర్శిటీలు అభివృద్ధి కోసం 500కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంది. రాష్ట్రంలో ఉన్న 11 రాష్ట్ర యూనివర్శిటీలకు కనీసం నిర్వహణకు కూడా నిధులురావు. ఒక్క ఉస్మానియా యూనిర్శిటీకే 350 కోట్లు పైగా నిర్వహణకు అవసరం. కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ, శాతవాహన, జెఎన్టీయుహెచ్, ఫైన్ ఆర్ట్స్, మహిళా యూనివర్శిటీ, అగ్రికల్చర్ యూనివర్శిటీ,వెటర్నరీ, హార్టీకల్చర్ లాంటి వాటికి నిధులు కేటాయింపులు లేవు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రకారం బాసర ఐఐఐటిల లాగా మరో రెండు కేటాయిస్తామని చెప్పి వాటి గురించి కూడా ప్రస్థావన లేదు. పాఠశాల విద్యా రంగ లో ఖాళీలు భర్తీ ,మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, ముత్రశాలలు, మౌళిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవని ఎస్ఎఫ్ ఐ భావిస్తోంది. గురుకులాలు నిర్మాణం కోసం కూడా కనీస నిధులు లేవు ఇప్పటికే రాష్ట్రంలో 800 పైగా గురుకులాలకు స్వంత భవనాలు లేవని, ఉన్న గురుకులాలు కూడా సరైన మౌళిక సదుపాయాలు లేవు. ఈబడ్జెట్లో గత ఆరేళ్ళ నుండి పెండింగ్ ఉన్న స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్ మెంట్స్ 7 వేల కోట్ల పైగా పెండింగ్ లో ఉన్నాయి. వాటికి విడుదల కోసం నిధులు కేటాయించలేదు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసిన స్పష్టమైన నిధులు లేవు. అందుకే ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం లాగా కాకుండా 15% పైగా నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని చెప్పి 7.3% నిధులు మాత్రమే కేటాయించారు. విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీ కూడా ఎలాంటి చర్చ లేదు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాని అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది.. ఈ కార్యక్రమంలో SFI జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్ కుమార్ జిల్లా నాయకులు ఆర్యా , రాజేష్, రాజు, అరుణ్ , శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

---



## కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేవరకొండ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జవానుల వేషధారణతో అమరుల నివాళి స్థూపాన్ని విద్యార్థులచే ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానాచార్యులు సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... 1999లో భారతదేశ భూభాగాన్ని సంరక్షించడం కోసం ప్రాణత్యాగం చేసిన 527మంది అమరజవానుల త్యాగాన్ని స్మరించుకునే సందర్భమే కార్గిల్ విజయ్ దివస్ అని తెలిపారు.జమ్మూ కాశ్మీర్ ను ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేసిన పాకిస్థాన్ కుటిల ప్రయత్నాన్ని తిప్పికొట్టిన భారత జవానుల పోరాట పటిమను, సామర్థ్యాన్ని, సమర్పణ భావాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.అనంతరం ప్రాణ త్యాగం చేసిన అమర జవానులను స్మరించుకుంటూ పాఠశాల విద్యార్థులతో ఒక నిముషం పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ అన్వర్ హుస్సేన్, విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

---

## గుర్రం బుచ్చయ్య మృతి బాధాకరం

- నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణానికి చెందిన గుర్రం బుచ్చయ్య మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణములో గుర్రం బుచ్చయ్య మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బుచ్చయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.బుచ్చయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు TVN రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, బిఆర్ ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ,పగిడిమర్రి నాగరాజు, తదితరులు ఉన్నారు.

---

## గాజుల భీమయ్య మృతి బాధాకరం

- నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణానికి చెందిన గాజుల భీమయ్య మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శుక్రవారం దేవరకొండ పట్టణములో భీమయ్య దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భీమయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.భీమయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు TVN రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్ గౌడ్,గాజుల ఆంజనేయులు, బి ఆర్ ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు,గాజుల రాజేష్, బి ఆర్ ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, పగిడిమర్రి నాగరాజు, మేడం రాములు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

---

## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25వ కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవన్ నందు కార్గిల్ విజయ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగినది. ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి జక్కుల శ్రీనయ్య ని ముఖ్య అతిథులు SBI దేవరకొండ శాఖ చీఫ్ మేనేజర్ ఫన్నీధర్, అధ్యక్షుడు NVT సభ్యులతో కలిసి శాలువాతో సత్కరించి మెమొంటో అందజేసి కార్గిల్ విజయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. అధ్యక్షుడు NVT మాట్లాడుతూ.. 1999 జులై 26న భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారని అన్నారు,దేశ సరిహద్దులలో చలి అనక ,వాన ఆనక, ఎండనకా మనకోసం దేశం కోసం పోరాడుతున్న విధులు నిర్వహిస్తున్న భారత ఆర్మీ జవాన్లకు శుభాకాంక్షలు తెలిపారు ,యువత ప్రతి ఒక్కరు ఆర్మీ గురించి తెలుసుకోవాలని అన్నారు,అలాగే దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవానులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అలాగే మెటిల్డ స్కూల్ విద్యార్థులకు సిబ్బందికి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, భాస్కర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, డైరెక్టర్ వాసు, SFI విద్యార్థి సంఘం లీడర్ వెంకటేష్ ,డాన్స్ మాస్టర్స్ ఏడుకొండలు, రాక్ స్టార్ రమేష్, పగిడి మర్రి శ్రీను, గోపాల్, రాజ్ కుమార్, డాన్స్ మాస్టర్ జగన్, వినోద్, రాము, ప్రవీణ్, శ్రీను, శంకర్, క్రీడాకారులు కళాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

---

## విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

- ఘనంగా పీవీ ఉన్నత పాఠశాల ఇన్వెస్టిచుర్ సెరిమణి
- ఏసీపి వెంకట్ రెడ్డి




**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పాపారాయ విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం నాడు ఇన్వెస్టర్ సెరమణి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసిపి వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ హాజరయ్యారు. అనంతరం పాఠశాల యాజమాన్యం నిర్వహించిన స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్, కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేసి విద్యార్థుల నాయకులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం ఎసిపి వెంకట్ రెడ్డి విద్యార్థులనుదేశిస్తూ మాట్లాడుతూ... విద్యార్థి దశ నుండే మంచి క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. పెద్దలపట్ల, తల్లిదండ్రుల పట్ల గౌరవం ఉండాలని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి వారి నమ్మకాన్ని నిలబెట్టాలని అన్నారు. ఏరోజు చదువును అదే రోజు చదవాలని సమయం ఉంది కదా తరువాత చదువుతానులే అని అనుకోవద్దని విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా లైసెన్స్ లేకుండా ఎవరు బండి నడప రాదని ఒకవేళ ఎవరైనా అలా వాహనాన్ని నడిపి ఏదైనా ప్రమాదం చేసినట్లయితే మైనర్లకు మూడు సంవత్సరాలు, వాహన యజమానులకు 10 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, నరసింహులు గౌడ్, ఆంజనేయులు, ఎస్కెమ్ పాఠశాల రెస్పాండెంట్ లవ కుమార్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

---

## ఛలో ఢిల్లీ

- లంబాడ సామాజిక వర్గానికి మంత్రి పదవి రాష్ట క్యాబినెట్లో చోటు కల్పించాలి బాబు రామ్ నాయక్

**జయభేరి, దేవరకొండ :**

లంబాడ సామాజిక వర్గానికి మంత్రి పదవి రాష్ట్ర క్యాబినెట్లో చోటు కల్పించాలని లంబాడా సంఘాల JAC జాయింట్ ఆక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీ లో AICC కార్యాలయం నందు వినతి పత్రం ఇచ్చి మా మంత్రి పదవి సమస్య ను పరిష్కారం చేయాలనీ బయలుదేరిన లంబాడా బిడ్డలు.

తెలంగాణలో సుమారు 40 నుంచి 50 లక్షల జనాభా ఉన్నరు. దాదాపుగా 46 అసెంబ్లీ స్థానాలు 6 పార్లమెంట్ స్థానాలు కేవలం లంబాడ సామాజిక వర్గం ఆధారపడి ఉంటారు అదేవిధంగా నిన్న జరిగిన అసెంబ్లీలో కూడా మా లంబాడి సామాజిక వర్గం మీదనే ఆధారపడి నిన్న అధికారంలో వచ్చినారు.

ఈ విషయాన్ని గుర్తించాలి, గతంలో 1978 నుంచి మా సామజిక వర్గానికి మంత్రి పదవి ఇస్తున్నారు. కానీ ఇప్పుడు ఎలాంటి పదవులు ఇవ్వక పోవడం దురదృష్టకారం. ఇవ్వని పక్షంలో జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేసి ఎసిసి కార్యాలయాన్ని ముట్టడిస్తాం అనేసి హెచ్చరించిన లంబాడా సంఘాల జాయింట్ ఆక్షన్ కమిటీ హెచ్చరించారు.

---

## స్థానిక సంస్థల రిజర్వేషన్లు బీహార్ తరహాలో అమలు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి మహనీయుల ఆశయ సాధన కు కృషి చేస్తూ మహనీయులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, సర్దార్ సర్వాయి పాపన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతోమంది మహనీయులను స్మరించుకుంటూ ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... ఎలక్షన్ మేనిఫెస్టోలో రాజకీయ పార్టీలు అధికారంలో రావడానికి బీసీ డిక్లరేషన్ స్వయంగా పార్టీ అధిష్టాన నాయకులు ప్రకటించగా బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీ జనాభా ప్రాతిపాదికన బీహార్ తరహాలో 46% స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ ఇప్పుడు జరిగే అసెంబ్లీ సమావేశాలలో చట్ట రూపంలో అమలుచేసి బీసీలకు న్యాయం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చోల్లోటి భాస్కరాచారి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు అంకం చంద్రమౌళి, రాసమల్ల నాగయ్య ముదిరాజ్, కూరెళ్ళ కృష్ణ చారి, ముసిని సత్యం,గౌరోజు బ్రహ్మాచారి,వనం శ్రీను ,ఇరగ దిండ్ల కృష్ణ,సయ్యద్ అజ్మతుల్ల, కూరెళ్ళ రామకృష్ణ చారి, ఏరువ కృష్ణయ్య, ముసిని వీరయ్య, ఎంకలి యాదయ్య గౌడ్, కొండోజు లక్ష్మీనారాయణ చారి, తిరందాసు వెంకటేశ్వర్లు,కొప్పెర శీను తదితరులు పాల్గొన్నారు.

---



## ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి

- కుందా భానుచందర్

**జయభేరి, మేడ్చల్ :**

వృద్ధులకు సకాలంలో పెన్షన్లు అందడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ నేతలు కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని గుండ్ల పోచంపల్లి పరిధిలోని 5వ వార్డ్ కాంగ్రెస్ నేత కుండా భానుచందర్ ఆరోపించారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ లో పింఛన్లు అందజేసే మిషన్లు మొరాయించడం వల్ల రెండు రోజుల పాటు కొంత జాప్యం జరిగిందని స్వయంగా పోస్ట్ ఆఫీస్ సిబ్బంది సతీష్ ఈ విషయం వెల్లడించారని కుండ భానుచందర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతినెల పెన్షన్లను సకాలంలోనే విడుదల చేస్తుందని, ఈ ఒక్క నెల లో మాత్రం పింఛన్లను అందజేసే మిషన్ జాప్యం వల్ల ఆలస్యమైందని పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పేర్కొన్నారని కుండ భానుచందర్ తెలిపారు. పింఛన్ల కోసం వృద్ధులు ఉదయమే వచ్చి పోస్ట్ ఆఫీస్ ముందు కూర్చుంటే ఆ ఫోటోలను తీసి పింఛన్ల కోసం వృద్ధులు పడిగాపులు కాస్తున్నారు అంటూ సీఎం రేవంత్ రెడ్డిని భదనం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదని, కుండ భానుచందర్ పేర్కొన్నారు.

---

## ఆత్మహత్య కేసులో రాజకీయ పార్టీ కక్షా సాదింపులా..?

**జయభేరి, కైకలూరు :**

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం సాన రుద్రవరం గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కొన్నాడని.. హత్య ఆత్మహత్య ఎవరికీ తెలియని విషయం దీని పై సంబంధిత యంత్రాంగం పూర్తి దర్యాప్తు చేసి నిందితులను చట్టం ముందు ప్రవేశపెట్టి దోషులను శిక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.. సేకరించిన వివరాల్లోకి వెళితే రామకృష్ణ వ్యక్తి జనసేన కార్యకర్త.. అతను వైకాపాకు వస్తావు చెందిన వ్యక్తి పొలంలో మట్టి తరలిస్తాడని కొంతమంది ఆరోపణలు గత వారంలో కింద పోలీసు యంత్రాంగం వాహనంలను సీజ్ చేసి ఉన్నత అధికారులకు అప్పగించినట్టు సమాచారం సదరు బాధితుడు రామకృష్ణ కొంతమంది కూటమి అభ్యర్థులకు వెళ్లి నాకు న్యాయం చేయండి అని అభ్యర్థి నిస్తున్నట్టు సమాచారం అతనితో పాటు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మజా ప్రజా ప్రతినిధి మధ్య వాగ్వాదం జరిగినట్టు సమాచారం అతను మనస్థాపానికి గురిచింది ఆత్మ చేసుకున్నాడా... లేదా.. రాజకీయ నాయకులు కక్ష ని సాధించారని పలువురు విమర్శిస్తున్నారు ఈరోజు పోస్టుమార్టం ప్రభుత్వ ఆసుపత్రికి కలిదిండి మండలం నుండి న్యాయం చేయాలని ప్రజల భారీ ఎత్తున తరలివచ్చారు ఇక్కడికి వచ్చిన పోలీస్ యంత్రాంగం.. డీఎస్పీ మీడియా వివరణ కోరగా సమాధానం దాటవేస్తూ సరైనా వివరణ ఇవ్వకుండా వెళ్లిపోవడం గమన హారం దీనిపై ప్రభుత్వం స్పందించి దోషలను శిక్షించాలని ఈ ప్రాంత ప్రజలకు కోరుతున్నారు.




# డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్

రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ జోరు పెంచారు. ఈ నెల 29న మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదలకానుంది. శుక్రవారం ఈ సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పాట నాయకానాయికల మధ్య చక్కటి రొమాంటిక్ కెమిస్ట్రీతో ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమాలో రామ్ ఓల్డ్‌సిటీ శంకర్ పాత్రలో కనిపించనున్నారు. 'ఇస్మార్ట్ శంకర్' మాస్ హిట్‌గా నిలవడంతో సీక్వెల్ 'డబుల్ ఇస్మార్ట్' పై భారీ అంచనాలు న్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. కావ్యథాపర్, సంజయ్‌దత్, అలీ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్.





# పాకిస్తాన్ హీరోయిన్ ఖరారు..!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఈశ్వర్ సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో రంగ ప్రవేశం చేశాడు. ఆ తరువాత పలు సినిమాల్లో నటించి తన పురోగతిని సాధించాడు. అగ్ర దిగ్గజ దర్శ కుడు రాజమౌళి రూపొందించిన `బాహుబలి` చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. బాహుబలి 1 ,బాహుబలి2 తరువాత ప్రభాస్ నటించిన రాధే శ్యామ్, సాహో చిత్రాలు యావరేజీగా నిలవగా.. ఆదిపురుష్ చిత్రం డిజాస్టర్ అనిపించుకుంది. ఈ మధ్య కాలంలో విడుదలైన `కల్కి 2898 ఏడీ` సినిమా బ్లాక్ బస్టర్ అవ్వ డంతో మరోసారి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు ఈ పాన్ ఇండియా స్టార్. ప్రస్తుతం మారుతి దర్శకత్వలో రాజాసాబ్ అనే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నాడు. అయితే ప్రస్తుతం తదుపరి చిత్రం గురించి మరో ఆసక్తికరమైన న్యూస్ కూడా వైరల్ అవుతుంది. ప్రభాస్ తరువాతి చిత్రం `సీతా రామం సినిమాను రూ పొందించిన దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో `ఫౌజీ` అనే సినిమా రాబోతున్నట్లు ప్రకటించారు. అయితే ఈయన దర్శక త్వంలో ఇప్పుడు రాబోతున్న చిత్రంలో ప్రభాస్ ఒక సైనికుడి పాత్ర పోషిస్తున్నారట. ఈ సినిమా దేశభక్తికి సంబంధించిన సినిమా. ఇది ఒక ఇండియన్ మిలటరీకి సంబంధించిన కథ. ఇందులో పాకిస్తాన్ హీరోయిన్ సాజల్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ యార్ని నవీన్, యలమంచలి రవి శంకర్ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 22న ఈ సినిమాను లాంచ్ చేయదా నికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా హను రాఘవపూడి ప్రీవియస్ బ్లాక్‌బస్టర్ చిత్రం సీతారామం చిత్రంలో హీరో దుల్కర్‌సల్మాన్ కూడా సైనికుడిగానే కనిపించిన సంగతి తెలిసిందే.

# కేసీఆర్ అంటే అందరికీ గౌరవం..

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ హీరోగా నటిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్‌ముంత ఛోడ్‌చింత' అనే గీతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడిన 'ఏం జేద్దామంటవ్ మరీ..' అనే మాటలను హుక్‌లైన్‌గా తీసుకోవడం వివాదానికి దారితీసింది. తెలంగాణ సాధకుడు, పదేళ్లు రాష్ట్రాధినేతగా పనిచేసిన కేసీఆర్ వంటి గొప్ప నాయకుడిని కించపరిచే విధంగా ఆయన మాటలను వాడారని తెలంగాణవాదుల నుంచి విమర్శ లొచ్చాయి. తాజాగా ఈ వివాదంపై చిత్ర సంగీత దర్శకు డు మణిశర్మ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. కేసీఆర్ గారంటే అందరికీ గౌరవమని, ఆయన సరదాగా చెప్పిన ఓ మాటను పాటలో తీసుకున్నామని, ఎవరినీ నొప్పించ డం తమ ఉద్దేశం కాదని వివరణ ఇచ్చారు. 'చాలా మంది ఆ పాటను ఐటెమ్‌సాంగ్ అనుకుంటున్నారు. కానీ అది డ్యూయెట్. సోషల్‌మీడియాలో వచ్చే మీమ్స్‌ను తీసుకొని లిరిక్స్ రాశాం. స్వరకర్తగా నా 27 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఇప్పటివరకు ఎవరినీ బాధపెట్టలేదు. కేసీఆర్‌గారు సరదా చెప్పిన మాటను తీసుకున్నాం. ఈ పాట ద్వారా కేసీఆర్‌గా రిని ఓసారి గుర్తుచేసుకున్నాం. అందరూ అలానే భావిం చాలని కోరుతున్నా' అని మణిశర్మ చెప్పారు.





# బంగారం లాంటి టైటిల్?

మహేశ్‌బాబురాజమౌళి సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన విషయం ఒకటి బయటకు వచ్చింది. ఈ పాన్ వరల్డ్ ఫ్రాంచైజీకి 'గోల్డ్' అనే పేరును ఖరారు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ట్రెజర్ హంట్ నేపథ్యంలో సాగే కథాంశం కావడం చేత, 'గోల్డ్' అనే టైటిల్ ఈ కథకు యాప్ట్‌గా ఉంటుందని, పైగా 'గోల్డ్' యూనివర్సల్ టైటిల్ కాబట్టి.. ఈ టైటిలే కరెక్ట్ అని రాజమౌళి భావిస్తున్నారట. ఇందులో మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఓ పాత్ర హను మంతుడి లక్షణాలతో కూడి ఉంటుందట. ఇదిలావుంటే.. షూటింగ్ ప్రారంభానికి ముందే ఈ సినిమాకు సంబంధించిన ఓ గ్లింప్స్‌ని విడుదల చేసే యోచనలో రాజమౌళి ఉన్నట్టు వినికిడి. ఆ గ్లింప్స్ ద్వారా ఇందులో నటించే నటీనటుల వివరాలు ప్రకటిస్తారట. అదే రోజున టైటిల్ కూడా అనౌన్స్ చేస్తారా? అనేది తెలియాల్సివుంది. విజయేంద్రప్రసాద్ కథనైతే సిద్ధం చేశారు. మాటలు రాసే బాధ్యతను సాయిమాధవ్ బుర్రాకు అప్పజెప్పే యోచనలో దర్శకధీరుడు ఉన్నట్టు ఇన్‌సైడ్ టాక్. త్వరలోనే ఈ సినిమాకోసం రాజమౌళి ఓ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. అది పూర్తయ్యాకే షూటింగ్ అని తెలుస్తున్నది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఇందులో కీలమైన ప్రతినాయకుడి పాత్రను చియాన్ విక్రమ్ పోషించనున్నారట.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com